సాక్షి కామారెడ్డి

బుధవారం । 27 । ఆగస్టు । 2025



కట్టుదిట్టమైన ఏర్పాట్లు..
వినాయక నవరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు.
- 10లో ▸



సంఘాలు ఏర్పాటు చేయాలి
గ్రామాలలో ఈనెల 30వ తేదీలోగా కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీవో సురేందర్ అధికారులకు సూచించారు.
- 11లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.7 /22.4

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'సీసీ కెమెరాల ఏర్పాటులో జిల్లాకే ఆదర్శం'



గాంధారి : మండల కేంద్రంలో ఒకేసారి 42 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం, జిల్లాకే ఆదర్శమని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులుతో కలిసి నూతన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 42 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించడంతో నేరాల నియంత్రణ జరుగుతుందన్నారు. నేరాలు జరిగినా నేరస్తులు తేలికగా పట్టుబడతారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయం చేసిన వారిని ఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని ఆరు ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా భర్తీ చేయనున్నట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఖాళీలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. బాన్సువాడ మండలం కొత్తాబాదిలో 110, మద్నూర్ మండలం మేనూర్‌లో 208, నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట్‌లో 139, నిజాంసాగర్ మండలం అచ్చంపేట్‌లో 125, ఎల్లారెడ్డిలో 148, సదాశివనగర్‌లో 74 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తివివరాలకు సంబంధిత పాఠశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

యూరియా కోసం రైతుల ధర్నా



భిక్కనూరు : యూరియా కోసం మంగళవారం కాచాపూర్ సింగిల్‌విండో గోదాము వద్ద రైతులు ధర్నా చేశారు. సుమారు గంటపాటు నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియాను పంపించి రైతులకు మేలు చేయాలని కోరారు.

స్పాట్ కౌన్సెలింగ్‌కు ఏడు దరఖాస్తులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు మంగళవారం నిర్వహించిన స్పాట్ కౌన్సిలింగ్‌కు ఏడు దరఖాస్తులు వచ్చాయని ప్రిన్సిపల్ ఆరతి తెలిపారు. 28, 29వ తేదీల్లోనూ స్పాట్ కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

క్రమబద్ధీకరణ ఎప్పుడో!

■ పట్టణానికి చెందిన ఓ ఉద్యోగి విలీన గ్రామంలోని తన ఖాళీ స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడం కోసం ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫీజును ఆరు నెలల క్రితమే చెల్లించాడు. కానీ ఇప్పటివరకు అతని ప్లాట్ క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. దరఖాస్తు ఎల్–1 లో పెండింగ్‌లో ఉందని చూపించడంతో బల్దియాలో అధికారులను సంప్రదించాడు. వారు. ఇరిగేషన్‌కు సంబంధించిన కారణాన్ని చూపుతున్నారు. నెలలు గడుస్తున్నా ఆ దరఖాస్తు అక్కడినుంచి కదలడంలేదు.

■ దేవునిపల్లికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి తన ప్లాటును క్రమబద్ధీకరించడం కోసం ఫీజు మొత్తం చెల్లించాడు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేదు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడదామనుకున్నా అనుమతి రావడం లేదు. బల్దియా అధికారులను ప్రశ్నించగా ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉందని సంబంధిత శాఖతో మాట్లాడి పరిష్కారం చూపుతామని చెబుతున్నారు. నెలలు గడుస్తున్నా పరిష్కారం మాత్రం లభించడం లేదని ఆవేదన చెందుతున్నాడు.



- ఫీజు చెల్లించి నెలలు గడుస్తున్నా ముందుకు సాగని ప్రక్రియ
- ఇబ్బంది పడుతున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు

కామారెడ్డి టౌన్ : ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించినా.. ఫైల్ ముందుకు కదలడం లేదు. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరణ కోసం మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు అనుసంధానం చేశారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించగానే మున్సిపల్ శాఖ క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఆ తర్వాత మిగతా రెండు శాఖలు ఆన్‌లైన్‌లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి మున్సిపల్ శాఖకు పంపుతాయి. చివరగా టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేసి దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందిస్తారు. అయితే ఈ మూడు శాఖల మధ్య సమన్వయ లోపంతో జిల్లాలో చాలా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

దరఖాస్తు ఫీజు చెల్లించిన 5,297 మంది..

ఎల్‌ఆర్‌ఎస్ –2020 పథకం ద్వారా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో కలిపి 20,501 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరినుంచి మే వరకు 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో జిల్లాలో 5,297 మంది దరఖాస్తు ఫీజు చెల్లించారు. కామారెడ్డి మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 17,687 మంది దరఖాస్తు చేసుకోగా 15,275 దరఖాస్తులకు ఆమోదించారు. ఇందులో 4,694 మంది ఫీజు చెల్లించగా 2,332 దరఖాస్తులను పరిష్కరించి వాటి యజమానులకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బాన్సువాడ మున్సిపాలిటీలో 1,903 దరఖాస్తులు రాగా 1,519 దరఖాస్తులకు ఆమోదం లభించింది. ఇందులో 358 మందే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించగా.. 217 అర్జీలకే ఉత్తర్వులు ఇచ్చారు. ఎల్లారెడ్డిలో 911 దరఖాస్తులు రాగా 691 ఆమోదించారు. ఇందులో 245 మంది ఫీజు చెల్లించగా 178 దరఖాస్తులు పరిష్కారం కావడంతో సర్టిఫికెట్లు అందించారు. దరఖాస్తు ఫీజు చెల్లించినవాటిలో ఇంకా సగం వరకు దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో దరఖాస్తుదారులు నిత్యం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మూడు శాఖల మధ్య సమన్వయ లోపంతోనే దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదన్న విమర్శలున్నాయి. క్రమబద్ధీకరణతో బల్దియాలకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు అనుసరిస్తున్న తీరుతో దరఖాస్తుదారులు విసిగిపోతున్నారు. బల్దియాలో కౌంటర్‌లు ఎత్తివేయడం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంపై అర్జీదారులు మండిపడుతున్నారు. త్వరగా తమ ప్లాట్లను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన వాటి వివరాలు

మున్సిపాలిటీలు	దరఖాస్తులు	ఫీజు చెల్లించినవి	ఉత్తర్వులు జారీ చేసినవి	ఆదాయం (రూ.కోట్లలో)
కామారెడ్డి	17,687	4,694	2,332	11.47
బాన్సువాడ	1,903	358	217	0.38
ఎల్లారెడ్డి	911	245	178	0.95

క్రమబద్ధీకరిస్తున్నాం



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఫీజు చెల్లించి అన్ని సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించి ఉత్తర్వులను అందజేస్తున్నారు. మిగతా శాఖల అధికారులతో మాట్లాడుతూ దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.
– గిరిధర్, టీపీవో, కామారెడ్డి



మద్నూర్‌లో ప్రతిష్ఠించడానికి తీసుకువస్తున్న రైతు గణపతి విగ్రహం

వస్తున్నా.. వచ్చేస్తున్నా..

- తరలివస్తున్న గణనాథులు
- నేడు వినాయక చవితి

విఘ్నాలను తొలగించే గణేశుడి పూజకు వేళయ్యింది. నవరాత్రులు ఘనమైన పూజలు అందుకునేందుకు ఆ గణాధిపతి తరలివస్తున్నాడు. తొలి పూజలందుకునేందుకు మండపాలలో కొలువుదీరనున్నాడు. బుధవారం వినాయక చవితి.. ఈ సందర్భంగా భక్తులు వాడవాడలా మండపాలను ఏర్పాటు చేశారు. పండుగ నేపథ్యంలో మంగళవారం మార్కెట్లు కళకళలాడాయి. విగ్రహాలతోపాటు పూజా సామగ్రి కొనుగోళ్లలో భక్తులు బిజీగా కనిపించారు. చాలాచోట్ల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.
– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

రోడ్డు పైకి.. ఠాణా కిందికి..

మెదక్ –ఎల్లారెడ్డి రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేసే క్రమంలో నాగిరెడ్డిపేట మండల కేంద్రమైన గోపాల్‌పేటలో రోడ్డు ఎత్తును పెంచారు. దాదాపు ఏడెనిమిది ఫీట్ల మేర రోడ్డు ఎత్తు పెరగడంతో ఆ రోడ్డు పక్కనే ఉన్న నాగిరెడ్డిపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. రోడ్డు మీద వర్షం పడితే నేరుగా ఠాణాలోకే నీరు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పోలీస్ స్టేషన్ భవనం కూడా శిథిలావస్థకు చేరుతోంది.
– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ భవనం వద్ద ఎత్తులో వేసిన రోడ్డు

టీచర్‌పై సస్పెన్షన్ వేటు

- మధ్యాహ్న భోజన ఏజెన్సీ తొలగింపు
- వంట సామగ్రిని పరిశీలించిన అధికారులు

భిక్కనూరు: శెట్పల్లూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు స్వప్నపై ఉన్నతాధికారులు మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి సోమవారం 22 మంది విద్యార్థులు వాంతులు చేసుకొని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో గోపాల్ పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. టీచర్ సరైన పర్యవేక్షణ చేయకపోవడంతోనే ఇలా జరిగిందని అధికారుల విచారణలో తేలింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో ఉపాధ్యాయురాలు స్వప్నకు సస్పెన్షన్ లెటర్ అందించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా ఏజెన్సీ నిర్వహకులను పెట్టుకోవాలని హెచ్‌ఎం ఖాజాకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు వాటర్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో పరీక్షించారు. నీరు కలుషితం కావడం లేదని రిపోర్ట్ వచ్చిందన్నారు.



టీచర్‌ను సస్పెండ్ చేయవద్దని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న శెట్పల్లూర్‌వాసులు

సస్పెన్షన్ వద్దని స్థానికుల ఆందోళన...

అనుకోకుండా జరిగిన ఘటనకు ఉపాధ్యాయురాలు స్వప్న కారణం అంటూ అధికారులు సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని శెట్పల్లూర్ వాసులు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల వద్ద ఆందోళన చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఉపాధ్యాయురాలు స్వప్నను బలి చేయవద్దని ఆమె వల్ల ఎలాంటి పొరపాటు జరగలేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఉన్నాతాధికారులు ఆలోచించి సస్పెన్షన్ వేటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ తహహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు

మద్నూర్: పెద్ద ఎక్లార గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో మంగళవారం పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వాతావరణ మార్పులతో పలువురు విద్యార్థినులు వాంతులు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారని ప్రిన్సిపాల్ స్వప్న తెలపడంతో డోంగ్లీ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 60 మందికి వైద్య పరీక్షలు చేశామని, 15 మందిని బిచ్కుంద ఆస్పత్రికి రిఫర్ చేశామని ఎంఎల్‌హెచ్‌పీ బస్వరాజ్ తెలిపారు. రిఫర్ చేసిన వారి రక్త నమూనాలను సేకరించి వైద్యం అందిస్తామన్నారు. వైద్య శిబిరంలో ఏఎన్ఎం స్వరూప, ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

సబ్ కలెక్టర్ సందర్శన..

పాఠశాల విద్యార్థులు పలువురు ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. దీంతో సిబ్బంది వారిని ఆటోలో బిచ్కుందలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం రాత్రి పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు.

'ఒకటిన పెన్షన్ విద్రోహ దినం'



కామారెడ్డి అర్బన్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ ఒకటో తేదీన కలెక్టరేట్‌లో పెన్షన్ విద్రోహ దినం నిర్వహించనున్నట్లు ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం జేఏసీ ప్రతినిధులు కలెక్టరేట్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కరువు భత్యాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి దేవేందర్, ప్రతినిధులు నాగరాజు, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగం, నర్సింహారెడ్డి, హన్మంత్‌రెడ్డి, మనోహర్‌రావు, భాస్కర్‌రెడ్డి, బషీర్, ముజీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

దోమకొండ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గడికోటలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించిన వారిని అభినందించారు. మండలంలోని 10 పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ పోటీలు నిర్వహించారు.

పాఠశాల తనిఖీ..

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనుమతులు లేకుండా సెలవులు పెట్టరాదని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి వెంకటేశ్వర్ గౌడ్, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఆర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్, నాయకులు తీగల తిర్మల్‌గౌడ్, నల్లపు అంజలి, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జి పాల్గొన్నారు.



బాణం వదిలి ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కమీషన్ బకాయిలు చెల్లించాలి

- రేషన్ డీలర్ల డిమాండ్
- లేకపోతే బియ్యం పంపిణీని బహిష్కరిస్తామని హెచ్చరిక

కామారెడ్డి రూరల్: తమకు రావాల్సిన ఐదు నెలల కమీషన్‌ను ఈనెలాఖరులోగా చెల్లించాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. లేకపోతే వచ్చేనెలలో బియ్యం పంపిణీని బహిష్కరిస్తామని హెచ్చరించారు. మంగళవారం జిల్లాలోని రేషన్ డీలర్లు జిల్లాకేంద్రంలో ర్యాలీ తీశారు. కలెక్టరేట్ ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ పాత బకాయిలు చెల్లించాలని, బియ్యం పంపిణీ అయిపోగానే కమీషన్ వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ. 300 కమీషన్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజు, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, ప్రతినిధులు హేంసింగ్, మల్లారెడ్డి, శ్రీనివాస్, రాజు, సంతోష్‌రావు, శంకర్‌రావు, లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న రేషన్ డీలర్లు

అంచనాలకు మించి సాగు

- 5.30 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు..
- అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న వరి
- భారీ వర్షాలతో పంటలకు ఢోకా లేనట్లేనంటున్న రైతులు

ఎల్లారెడ్డిరూరల్ : జిల్లాలో వానాకాలం సీజన్‌లో వ్యవసాయ శాఖ అధికారుల అంచనాలకు మించి పంటలు సాగయ్యాయి. అన్ని పంటలు కలిపి 5.30 లక్షల ఎకరాలుండగా.. ఇందులో ఒక్క వరి పంటే 2.92 లక్షల ఎకరాలలో సాగవుతుండడం గమనార్హం.

వానాకాలం ప్రారంభానికి ముందే జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు ముందస్తుగానే పంటల సాగు మొదలుపెట్టారు. మధ్యలో వర్షాలు లేకపోవడంతో ఆందోళన వ్యక్తమైనా ఇటీవల కురిసిన వర్షాలతో అన్నదాతలు ఊరట చెందారు. వరి సాగు విస్తీర్ణం అంచనాలకు మించింది. 2,92,786 ఎకరాలలో వరి సాగవుతుందని అంచనా వేయగా.. 3,10,573 ఎకరాలలో నాట్లు వేశారు. పత్తి సాగు మూడింతలైంది. రైతులు అంచనాల కన్నా రెట్టింపు విస్తీర్ణంలో కంది సాగు చేశారు. రైతులు పెసర్లు, మినుముల సాగును సగానికన్నా తగ్గించారు. సోయా, మక్కతోపాటు ఇతర పంటల సాగు కూడా తగ్గింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని నిజాంసాగర్, పోచారం, కల్యాణి ప్రాజెక్టులు, సింగితం రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండాయి. దీంతో పాటు గ్రామాలలోని చెరువులు, కుంటలు చాలావరకు నిండుకుండల్లా మారి పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. భారీ వర్షాలతో భూగర్భ జలాలు సైతం పెరగడంతో బోరుబావుల కింద సాగవుతున్న పంటలకు కూడా ఢోకా లేకుండా పోయింది. దీంతో వేసిన పంటలు గట్టెక్కుతాయన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డి శివారులో సాగవుతున్న వరిపంట

సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంది

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి పంటలు సాగవుతున్నాయి. ఈనెలాఖరు వరకు వరి నాట్లు వేసుకునే అవకాశాలున్నాయి. దీంతో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని భావిస్తున్నాం.
– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, కామారెడ్డి

జిల్లాలో సాగైన వివిధ పంటల వివరాలు.. (ఎకరాలలో)

పంటలు	సాగు అంచనా	సాగు విస్తీర్ణం
వరి	2,92,786	3,10,573
మక్క	59,550	50,736
పత్తి	11,700	31,529
సోయా	86,431	80,083
కందులు	26,662	50,511
పెసర్లు	8,129	3,192
మినుములు	5,842	2,557
ఇతర పంటలు	8,120	1,120
మొత్తం	4,99,220	5,30,301

క్లుప్తంగా

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు నాగేశ్వరరావు ఎంపిక



కామారెడ్డి అర్బన్: ఎల్ఐసీ జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎల్ఐసీ కామారెడ్డి శాఖ హెచ్‌జీఏ కె.నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు కర్నాటకలో నిర్వహించగా సికింద్రాబాద్ డివిజన్ నుంచి కామారెడ్డికి చెందిన నాగేశ్వరరావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు నాగేశ్వర రావు ఎంపిక కావడం ఇది నాలుగోసారి అని ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు.

ఎయిర్ ఫోర్స్‌లో పోస్టుల భర్తీకి ర్యాలీ

కామారెడ్డి అర్బన్: తమిళనాడులో సెప్టెంబర్ 5న అగ్నిపథ్ కింద ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో క్లరికల్, టెక్నికల్ కేడర్‌లో యువతుల ఉద్యోగాల భర్తీకి ర్యాలీ నిర్వహిస్తున్నారని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతులు అగ్నిపథ్ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవచ్చని లేదా తమ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

నానోయూరియాతో కాలుష్యం తగ్గుముఖం



బాన్సువాడ రూరల్: నానోయూరియా పిచికారీతో నేల, నీటి కాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గుముఖం పడతాయని బాన్సువాడ ఏడీఏ అరుణ అన్నారు. మంగళవారం ఆమె తాడ్కోల్ గ్రామంలో ఏవో ఫయాజుల్లా, ఏఈఓరాణి, రైతులతో కలిసి వరిపంట పొలాలను పరిశీలించారు. రైతులకు నానోయూరియా ప్రాముఖ్యతను వివరించారు. అరలీటర్ నానోయూరియా ఒక బస్తా యూరియా మందుతో సమానమన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య కమిటీ ఎన్నిక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పర్ణిక ప్యాలెస్‌లో ఉమ్మడి జిల్లా ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.జైపాల్ రెడ్డి, కార్యదర్శిగా నరాల సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాస్ రాజ్, ఉపాధ్యక్షులుగా అరుణ్ కుమార్, హకీమ్, అసోసియేట్ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరరావు, నవీన్ కుమార్, రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యులుగా గురువేందర్ రెడ్డి, హరి ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమానులు హరి స్మరణ్ రెడ్డి, మారయ్య గౌడ్, శంకర్, సూర్య ప్రకాష్, సృజన్ రెడ్డి, బాలాజీ రావు, ప్రతాప్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో సిద్ధం చేస్తున్న వినాయక మండపం





జిల్లా కేంద్రంలోని పూజా సామగ్రి విక్రయ కేంద్రాల్లో సందడి, వినాయక మండపం సెట్టింగ్‌.

మొదలైన చవితి సందడి



జిల్లా కేంద్రంలో వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

సాక్షి నెట్‌వర్క్: వినాయక చవితి పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం పండుగ వాతావరణం నెలకొంది. వివిధ గణేష్ మండళ్లు, గ్రామీణ ప్రాంతాల్లోని యువజన సంఘాలు, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు మండపాలను సిద్ధం చేసుకుంటున్నాయి. చిన్న పిల్లలు ఇంటి వద్ద మట్టి విగ్రహాలు తయారు చేస్తూ కనపడ్డారు. మట్టి, పీవోపీ విగ్రహాలు, పూజా సామగ్రి, పూలు, పండ్లు, లడ్డూల విక్రయాలు జోరుగా సాగాయి. ఎప్పటిలాగే అధిక ధరలకు విక్రయాలు సాగాయి. నేడు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నవరాత్రుల ఉత్సవాలు జరుపుతారు. చివరి రోజు పెద్ద ఎత్తున శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయి. పండుగ సందర్భంగా చాలా చోట్ల వివిధ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో పర్యావరణహితమైన మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని వారు కోరారు.



పెద్దకొడప్‌గల్‌లో.. డీఎల్‌పీవో సత్యనారాయణ రెడ్డి



జిల్లా కేంద్రంలో క్రెడా ఆధ్వర్యంలో..



మాచారెడ్డిలో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మాడిపోయిన సోయా పంట

- నాసిరకం మందుల పిచికారీతో మూడున్నర ఎకరాల్లో పంట నష్టం
- రైతు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం



చిన్నదడ్గిలో నాసిరకం మందు పిచికారీ చేయడంతో దెబ్బతిన్న సోయా పంట

బిచ్కుంద(జుక్కల్): పంటలపై పురుగు ఆశించకుండా మందు మంచిగా పనిచేస్తుందని వ్యాపారులు రైతులను నమ్మించి నట్టేట ముంచుతున్నారు. మండలంలోని చిన్నదడ్గి గ్రామానికి చెందిన గంగారాం మూడున్న ఎకరాలలో సోయా, అంతర పంటగా కంది సాగుచేస్తున్నాడు. సోయా పంటపై కొద్దిగా పచ్చ పురుగులు ఆశిస్తున్నాయని గుర్తించి 15 రోజుల క్రితం పురుగు మందు పిచికారీ చేశాడు. రెండో రోజు పంట పూర్తిగా ఎర్రబడి మొక్కలన్నీ వాడిపోయాయి. రైతుకు మందు విక్రయించిన వ్యక్తి ఎలాంటి లైసెన్సు లేకుండా బిచ్కుందలో ఇంటి వద్ద మందులు పెట్టుకొని తెలిసిన రైతులకు విక్రయిస్తాడు. గంగారాం.. మందుల వ్యాపారి వద్దకు వెళ్లి నిలదీశాడు. పురుగుల కోసం ఇచ్చిన మందుతో సోయా పంట పూర్తిగా ఎర్రబడి కాలిపోయిందని తెలిపారు. ఆ వ్యక్తి పై అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏవో అమర్ ప్రసాద్ పంట క్షేత్రానికి వెళ్లి పరిశీలించారు. నాసిరకం మందుతో పంట వాడిపోయిందని అధికారులు గుర్తించి మందు విక్రయించిన వ్యక్తిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు లేకుండా ఎలా విక్రయిస్తున్నావు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆ వ్యాపారి.. పంట నష్టపరిహారం రైతుకు అందిస్తానని ఒప్పుకోవడంతో శాంతించారు. 15 రోజులు అవుతున్నా పరిహారం డబ్బులు ఇవ్వడం లేదని రైతు గంగారాం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో చిల్లి గవ్వ పరిహారం ఇవ్వనని చెబుతున్నాడని రైతు వాపోతున్నాడు. దీనిపై ఏవో అమర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. రైతుకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.

పరిహారం ఇప్పించండి



ఐదారు సంవత్సరాల నుంచి మందు విక్రయించిన వ్యక్తి తెలుసు. ఆయన ఇంటి వద్ద ఉంచి మందులు విక్రయిస్తున్నారు. మంచి మందులు ఉన్నాయని నమ్మించి మోసం చేశాడు. పురుగు మందుకు బదులు నాసిరకం ఏ మందు ఇచ్చాడో తెలియదు. మూడు ఎకరాలకు కలిపి రూ.70 వేలు ఖర్చు చేశాను. పరిహారం ఇప్పించాలని కోరుతున్నాను. వ్యవసాయ అధికారులు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. న్యాయం లభించడం లేదు.

– గంగారాం, రైతు చిన్నదడ్గి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులతో అధ్యాపకులు

భిక్కనూరు: మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా పోటీ పడి సమానత్వం సాధించుకోవాలని దోమకొండ కోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ అన్నారు. సౌత్‌క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్నింటిలో సగభాగం అయిన మహిళలు మరింత ముందుకు వెళ్లాలన్నారు. ప్రపంచ యుద్ధ సమయంలో వివిధ దేశాలలో మహిళలు వస్తూత్పత్తి రంగంలోకి రావాల్సి వచ్చిందన్నారు. పురుషులందరూ యుద్ధంలో ఉండడంతో మహిళలే ఉత్పత్తి రంగాల్లోకి వచ్చి అధిక ఉత్పత్తి సాధించారని గుర్తు చేశారు. ఆ తర్వాత పురుషులు మహిళల నైపుణ్యాన్ని గుర్తించకపోవటంతో అనేక పోరాటాలు చేశారన్నారు. ముఖ్యంగా జర్మనీలో మొదలైన ఉద్యమం ప్రపంచ దేశాలకు పాకటంతో అప్పటి అంతర్జాతీయ సంస్థలు మహిళల హక్కులను గౌరవిస్తూ మహిళ దినోత్సవం జరపాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆనాటి నుంచి మహిళ దినోత్సవం జరుపుతున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, హాస్టల్ వార్డెన్ సునీత, ఏపీఆర్‌వో పిట్ల సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం



మాట్లాడుతున్న సలీం

భిక్కనూరు: సమాచారహక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం వంటిదని సమాచారహక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. మంగళవారం జంగంపల్లి మహాత్మాజ్యోతిభాపూలే పాఠశాల/కళాశాలలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం 2005, విద్యాహక్కు చట్టంపైన అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత, కమిటీ రాష్ట్ర సలహాదారు కేతు రమణారెడ్డి, స్పోక్స్‌మాన్ శ్రీనివాస రావు, నిజామాబాద్ జిల్లా మహిళ అధ్యక్షులు రషీదాబేగం, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

- ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్



ఎర్రకుంటతండాలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు సహకరించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. బెజుగంచెరువుతండా జీపీ పరిధిలో గల ఎర్రకుంటతండాను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరుకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని హెచ్‌ఎం మనోజ్‌కుమార్‌కు సూచించారు. మెనూప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి మురికి కాలువను, పారిశుద్ధ్య పనుల నిర్వహణ తీరును పరిశీలించారు. జీపీ కార్యదర్శి అనిత ఉన్నారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి, చిన్నదేమి శివారులోని మొక్కజొన్న పంటలపై అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. సోమవారం రాత్రి తాడ్వాయికి చెందిన సుర్కంటి రాజిరెడ్డి, మిద్దె అర్జున్‌లకు సంబంధించిన మొక్కజొన్న పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు కోరారు.

'మట్టి వినాయకులనే పూజించాలి'



కామారెడ్డి క్రైం: మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జనహిత గణేశ్ మండలి 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మట్టి గణపతుల వితరణ కార్యక్రమాన్ని కలెక్టర్ చేతుల మీదుగా మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణహితమైన మట్టి వినాయకులను పూజించడం మంచి సంప్రదాయమన్నారు. జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్, టీజీవోస్ జిల్లా కార్యదర్శి సాయి రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులతో పర్యావరణానికి మేలు



రాజంపేట: మట్టి వినాయకులతో పర్యావరణానికి హాని కలగదని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రమేష్ పేర్కొన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మట్టితో గణేశుడి విగ్రహాలను తయారు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో మట్టి గణేశ విగ్రహాల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటి రేంజ్ ఆఫీసర్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకుముడత నివారణకు చర్యలు



నిజాంసాగర్(జుక్కల్): వానాకాలం సాగు చేస్తున్న వరి పంటలపై ఆకుముడత పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని పురుగు మందులను సకాలంలో పిచికారీ చేయాలని మహమ్మద్‌నగర్ మండల ఏవో నవ్య సూచించారు. మంగళవారం ముగ్దుంపూర్ గ్రామ శివారులో వరి పంట పొలాలను ఆమె పరిశీలించారు. వరిపైర్లపై ఆకుముడత పురుగు అధికంగా ఉందన్నారు. పురుగు నివారణకు కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ మందును ఎకరానికి 400 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని చెప్పారు. ఆమె వెంట గాలీపూర్ క్లస్టర్ ఏఈవో రేణుక తదితరులున్నారు.

'ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి'



బాన్సువాడ పట్టణంలో గణేష్ శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎస్పీ రాజేశ్ చంద్ర

బాన్సువాడ: వినాయక ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. మంగళవారం జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర, డీఎస్పీ విఠల్‌రెడ్డిలతో కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రలకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కల్కి చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. పట్టణంలోని పాత బాన్సువాడ, కొత్త బాన్సువాడలో కాలినడకన పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్, పోలీసు, రెవిన్యూ, అగ్నిమాపక, విద్యుత్, ఆరోగ్య, ఇరిగేషన్ తదితర శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అపశృతి జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జ్ఞానప్రకాశ్‌రెడ్డి సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు: సమాజ సేవకుడు, కౌసల్యా దేవి ఫౌండేషన్ చైర్మన్ పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయం, ఆదర్శనీయమని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం జ్ఞానప్రకాశ్‌రెడ్డి తన తల్లిదండ్రుల దీవెనలతో మండల కేంద్రంలోని దళితవాడలో సుమారు రూ.2 లక్షల వ్యయంతో వినాయక మండపం నిర్మించారు. దీనిని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. తన సొంత డబ్బులతో మండల కేంద్రంలోని బస్టాండ్‌ను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఎలాంటి పదవులు లేకపోయినా సమాజసేవ కోసం ఆయన పాటుపడుతుండడం అభినందనీయమన్నారు. పట్టణానికి చెందిన అందె మహేందర్‌రెడ్డి, తున్కి వేణు, పాల రాంచంద్రం, దేవర లక్ష్మి, తాటికొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 2కే రన్



కామారెడ్డి క్రైం: మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి యేటా నిర్వహించే క్రీడా దినోత్సవం సందర్భంగా 10 రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఇందిరా గాంధీ స్టేడియం వరకు రన్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఏఎస్పీ చైతన్యా రెడ్డి, ఆర్డీవో వీణ కాగడా వెలిగించి, జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వెంటనే ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: జిల్లాలో యూరియా కొరత తీర్చి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారికి వినతి పత్రం అందజేశారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో యూరియా కొరత, ఇతర సమస్యలను వివరించారు. పొట్ట దశలో ఉన్న వరి, మక్కకు యూరియా వేయకుంటే దిగుబడి రాక రైతాంగం భారీ నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. బీకేఎస్ ప్రతినిధులు శంకర్‌రావు, ఆనందరావు, సాయిరెడ్డి, రమణారెడ్డి, గోపాల్‌రెడ్డి, చిన్న అంజన్న, కృష్ణారెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ పోరాట సభను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డి: పాత పెన్షన్ పోరాట సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కో– చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మత్తమాల జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లో సభ ఏర్పాటు చేశామన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



భిక్కనూరు: అప్పుల బాధతో మండల కేంద్రానికి చెందిన యువకుడు మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరుకు చెందిన బండి రాజు (35) మైక్రో ఫైనాన్స్, హౌసింగ్ ఫైనాన్స్‌లో అప్పులు తీసుకున్నాడు. చెల్లించడంలో ఆలస్యం కావడంతో ఏజెంట్లు ఇబ్బందులకు గురిచేశారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురై మంగళవారం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, తల్లి రాధ, కుమారుడు మనోజు, కుమార్తె రిషిక ఉన్నారు.

ప్రేమించిన యువతి మోసం చేసిందని..!

- రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యాయత్నం
- కాపాడిన స్థానికులు

కామారెడ్డి క్రైం: ప్రేమించిన యువతి మోసం చేసిందని ఓ యువకుడు రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని పట్టాలపై నుంచి పక్కకు లాగి కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన సచిన్ అనే యువకుడు కొంతకాలంగా బెంగళూరులో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సెలవుపై రెండు రోజుల క్రితం కామారెడ్డికి వచ్చాడు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న గూడ్స్ రైలు రాకను గమనించి రైల్వేగేట్‌కు కొద్దిదూరంలో పట్టాలపై తల పెట్టి పడుకున్నాడు. యువకుడు ఆత్మహత్య చేసుకోబోతున్నది గమనించిన స్థానికులు వెంటనే అతడిని పక్కకు లాగి ఆరా తీశారు. అదే కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమించాడనీ, ఆమె మోసం చేయడంతో మనస్తాపం చెందినట్లు సదరు యువకుడి బంధువులు చెబుతున్నారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రూ.1,31,679ల సైబర్ మోసం

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రానికి చెందిన సంగెప్ప వీరేశం అనే వ్యక్తి సైబర్ మోసానికి గురై రూ.1,31,679లు పోగొట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బాధితుడికి సైబర్ మోసగాడు ఫోన్ చేసి ధని ఫైనాన్స్‌లో రూ.1లక్ష లాటరీ తగిలిందని తెలిపాడు. లాటరీ డబ్బులు ఇచ్చేందుకు జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు పేరిట విడతల వారీగా డబ్బులు వేయించుకున్నాడు. మోసపోతున్నానని గ్రహించిన సంగెప్ప 1930 నెంబర్‌కు కాల్ చేయగా సైబర్ మోసగాడి అకౌంట్‌లో ఉన్న రూ.3,407లు ఫ్రీజ్ చేశారు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీపీ ఎదుట పలువురి బైండోవర్



ఖలీల్‌వాడి: నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్‌లోని కమ్యూనల్ కేసులు, పాత నేరస్తులు, డీజే నిర్వాహకులు 28 మందిని జిల్లా అదనపు మేజిస్ట్రేట్, సీపీ సాయిచైతన్య ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష సొంత పూచీకత్తు విధించారు. మళ్లీ గొడవలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. కమిషనరేట్ అధికారాల ద్వారా ఒక్కొక్కరిని 6 నెలల పాటు బైండోవర్ చేసినట్లు తెలిసింది.